

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

సంపుటి : 5 సంచిక : 6 పుష్పం : 22-25 ఎడిటర్ : పి.హెచ్.వి. సత్యవతి (హైమ)



## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, జిన్నూరు 13-2-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడు జీవించటానికి ధనం అవసరం. కాని ధనం కంటే శాంతి గొప్పది, ధనం కంటే ఆనందం గొప్పది, ధనంకంటే సంతృప్తి గొప్పది. మీ ధనం మిమ్మల్ని సుఖపెట్టేదిగా ఉండాలి గాని దుఃఖపెట్టేదిగా ఉండకూడదు. మనం ధనమే గొప్పది అనుకొంటున్నాము. కాని ఆనందం ముందు, సుఖం ముందు, శాంతి ముందు ధనం చాలా తక్కువ స్థాయిలోనిది. అది మనం గ్రహించాలి. ఏ గురువు దగ్గరకు వెళ్ళినా సాధన చేయండి అంటున్నారు, ఇలా ఎంతకాలం చేయాలి అని ప్రశ్న. నీకు ఎంత కాలం అయితే తలంపులు వస్తున్నాయో అంతకాలం నీవు సాధన చేయవలసిందే. మనకు మంచి పవిత్రమైన భావాలు వస్తున్నాయి అనుకోండి. మన దేహం చనిపోయిన మన భావాలు మానవజాతి మీద పనిచేస్తాయి. మన దేహం ఇక్కడ లేకపోయినా మంచితలంపుల యొక్క ప్రవాహం మానవజాతి మీద పనిచేస్తూనే ఉంటుంది. జీవితం అంతా తలంపులే. దేహము నేను అనే మూలతలంపులోనుండి ఈ తలంపులు అన్నీ వస్తున్నాయి. ఆ మూలతలంపు వెళ్ళి హృదయంలో అణిగిపోయి కరిగిపోయే వరకు నీవు సాదన చేయవలసిందే. మేము భగవదనుభవం ఎప్పుడు పొందుతాము, ఈ జన్మలో సాధించగలమా అని ఇలా అడుగుతారు. అలా కంగారు పడవద్దు. గమ్యంలోఎంతశాంతి, ఆనందం ఉందని మీరు అనుకొంటున్నారో సాధన చేసేటప్పుడు కూడా మీరు అంత ఆనందంగా శాంతిగా చేయాలి. కష్టం, కష్టం అనుకొంటే మీరు సాధన చేయలేరు. గమ్యం గురించి ఆలోచించకూడదు. మీ చేతిలో ఉన్నపనిని జాగ్రత్తగా చేసుకొంటూ వర్తమాన కాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోండి.

రాత్రి సరిగా నిద్ర పట్టటంలేదు అని ధృతరాష్ట్రుడు విదురుడిని అడిగాడు. నిరంతరము

చెడ్డ ఆలోచిస్తూ, నిరంతరము ఎదుటివారి మీద ద్వేషం పెట్టుకొంటే నీకు నిద్ర ఎలా పడుతుంది. ఎప్పుడైనా మంచి కర్మలు చేస్తూ ఉంటే నీకు మంచి ఆలోచనలు వస్తూ ఉంటే నీకు నిద్రపడుతుంది అని చెప్పాడు. మనకు అనేక తలంపులు వస్తాయి. చెడు తలంపులను మొక్కలో ఉన్నప్పడే దానిని తొలగిస్తే అది తేలికగాపోతుంది, అదే చెట్టు అయిపోతే దానిని తొలగించటం కష్టం. మనకు ఏ కారణం వలన దుఃఖం వస్తూ ఉన్నా అక్కడ బంధం ఉందని అర్థం. మన ఇంటిలో ఎవరైనా మరణిస్తే మనకు దుఃఖం వస్తుంది. ఇంకో చోట ఎవరైనా మరణిస్తే మనకు దుఃఖం రాదు. అదీ మరణమే ఇదీ మరణమే. కాని ఇక్కడ దుఃఖం రావటానికి కారణం బంధం. బంధం వలన దుఃఖం వస్తుంది, భయం వస్తుంది. బంధం లేనివాడికి దుఃఖం లేదు, భయం లేదు. నీకు తలంపులు వస్తున్నంతకాలం ఈ తలంపులు వచ్చే నేను ఎవరు అని విచారణ చేస్తూ ఉండవలసిందే. ఇప్పడు దేహానికి సంబంధించిన ఎరుకలో ఎలా ఉన్నావో అలాగ ఆత్మకి సంబంధించిన ఎరుక ఎప్పడూ కలిగి ఉండాలి. ఆ ప్రజ్ఞ, వివేకం కలిగి ఉండాలి. సూర్యుడు మంచి చేసే వాడికి, చెడు చేసేవాడికి వెలుతురు ఇస్తాడు. కాని మంచి, చెడు వాడికి అంటదు. నీ హృదయంలో ఉన్న సద్వస్తువు కూడా అంతే, మంచి చెడు చేసేది వాసనే. ఆవాసన నీవు కాదు. నీ హృదయంలో ఉన్న సద్వస్తువే నీవు. సూర్యుడు బాహ్యవిషయాలకు ఎలా సాక్షిగా ఉన్నాడో అలాగే నీ లోపలున్న జ్ఞాన సూర్యుడు నీవు చేసే మంచికి, చెడుకు సాక్షిగా ఉంటాడు. ఈ దేహం పడిపోకముందే నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అప్పడు అమృతస్థితిని పొందుతావు. ఆ స్థితిని పొందాలంటే నీవు శివుడిలాగ బ్రతకాలి. శివుడు విషాన్ని తన కంఠంలో పెట్టుకొన్నాడు. అమృతాన్ని ఇతరులకు ఇచ్చాడు. అంటే చెడును కంఠంలో ఉంచుకున్నాడు, మంచిని ఇతరులకు ఇచ్చాడు. అనుకరణ వద్దు. నీలో ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకొని వాటిని తొలగించు కోవటానికి ప్రయత్నం చేయాలి. అది వర్తమాన కాలంలో చేయాలి. వర్తమాన కాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవటం మానివేసి భవిష్యత్ కాలం గురించి ఆలోచిస్తున్నావు అదే నీవు చేసే పొరపాటు. వర్తమానకాలాన్ని అలక్ష్యం చేస్తున్నావు. నిర్లక్ష్యం చేస్తున్నావు. చేతిలో ఉన్న కాలాన్ని వదిలేస్తున్నావు. అది వివేకవంతుడు చేసే పనికాదు. శరీరం ఉండగానే కామక్రోధముల యొక్క వేగాన్ని తట్టుకొని వాటిలో నుండి ఎవడైతే విడుదల పొందుతాడో వాడు మరణానంతరం కూడా ముగింపులేని ఆనందమును పొందుతాడు.

కొంతమంది యాంత్రికంగా పనిచేస్తారు. ప్రేమ ఉండదు, ఆప్యాయత ఉండదు. అలా

కాకుండా దైనందిన జీవితంలో నీవు పని చేసేటప్పుడు ప్రేమతో, ఆప్యాయతో, నీ మనస్సును అక్కడ పెట్టి పనిచేయాలి. అప్పుడు నీ పని పూర్తి అవుతుంది. సాధన పూర్తి అవుతుంది. అంటే నీవు చేసే పని హృదయపూర్వకంగా చేస్తే నీ మనస్సు వెళ్ళి హృదయ గుహలో పడిపోతుంది. శిరస్సులో మనస్సు ఎలా ఉంటోందో అలాగ హృదయంలో ఉండటానికి అలవాటుపడాలి. అలా అలవాటుపడితే మనకి జ్ఞానం వచ్చేస్తుంది. ప్రపంచంలో ఒకరిమీద ఒకరికి అసూయ తప్ప ప్రేమలేదు, స్నేహంగా కనిపించినా అది కూడా నటనే. ప్రపంచం అంతా ఇలా ఉంది ఏమిటి అని అడుగుతున్నారు. ఈ ప్రపంచం నీదీ కాదు, నాదీ కాదు. దానిని సృష్టించిన వాడు ఒకడు ఉన్నాడు. దాని గొడవ వాడు చూసుకొంటాడు. ముందు నీ గొడవ నీవు చూసుకో. నీవు బాగుపడే విధానం చూసుకో అంటున్నారు భగవాన్. ఇటువంటి విషయాలు ఆలోచిస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు తెలియదు. జీవితం అంతా ఒక స్వప్నం. రాత్రి మనకు స్వప్నాలు వస్తాయి. స్వప్నం ఒకరికి కొన్ని నిమిషాలు ఉండవచ్చు. ఒకరికి ఒక గంట ఉండవచ్చు, ఒకరికి రెండు గంటలు ఉండవచ్చు, ఎక్కడో ఒకచోట ముగింపు ఉందికదా, అలాగే నీ జీవితం కూడా స్వప్నమే. ఒకరు 30 సంవత్సరాలు బ్రతకవచ్చు, ఒకరు 70 సంవత్సరాలు బ్రతకవచ్చు. కాని ఎక్కడో ఒకచోట ముగింపు ఉంది ఎందుచేతనంటే అదికూడా స్వప్నమే కాబట్టి. స్వప్నం ముగింపులేకుండా ఎలా ఉంటుంది. ప్రతి మనిషి నేను అది చేసాను, నేను ఇది చేసాను అనుకొంటాడు వాడి రజోగుణం అలా కనిపింపజేస్తుంది. ఈ జీవితంలో ఏ పాఠాలు నేర్చుకోవాలో అది అంతా ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతుంది. ఈ దేహము నాది, ఈ దేహము నాది అని చెప్పే ఆ నేనును క్రియేటర్‌ను, క్రియేషన్‌ను దాటితేగాని పరమసత్యం నీకు అనుభంలోనికి రాదు. నీ హృదయంలో ఉన్న నిజం నీకు అనుభంలోనికి వచ్చినప్పుడు నీ ద్వారా ప్రపంచానికి ఎంతో మేలు జరుగుతుంది. కాని వాడు మాత్రం ప్రపంచానికి మేలు చేస్తున్నాను అని అనుకోడు ఎందుచేతనంటే ప్రపంచం తనకంటే భిన్నంగా లేదు. ప్రపంచం గొడవ వద్దు. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోండి, మిమ్మల్ని మీరు క్లోజ్‌గా చూసుకోండి. మీలో ఏమి ఉందో మీకు తెలుస్తుంది. లోకం గురించి ఆలోచించటం కాదు ఈ లోకం ఉందని నీలో ఎవడైతే చెపుతున్నాడో ఆ నేను గురించి ఆలోచించి దాని స్వరూపాన్ని తెలుసుకోండి. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవటం మానివేసి, విచారణ చేయటం మానివేసి ప్రపంచం గురించి ఆలోచిస్తూ మీ శక్తిని మీ కాలాన్ని వృధా చేసుకొంటున్నారు. మీ మనస్సు మిమ్మల్ని ఎలా మోసం చేస్తోందో గ్రహించండి. ఎక్కడయితే ఆత్మ ఉందో

అక్కడకు తీసుకొని వెళ్ళి మనస్సును నిలబెట్టి ఉంచితే మనస్సు కరిగిపోతుంది. అప్పుడు స్వరూపం నీకు వ్యక్తమవుతుంది.

జీవించి ఉన్నవారికంటే మరణించిన వారు అదృష్టవంతులు. ఎందుచేతనంటే వారు మనలను తొందరగా మర్చిపోతారు. కాని మనం వారిని తొందరగా మర్చిపోలేము. వారు ఎంత కాలం మనకు జ్ఞాపకం వస్తారో అంతకాలం మనకు దుఃఖం వస్తుంది. అలా దుఃఖపడటం కాదు వారి గురించి మంచి చెప్పండి. వారు జ్ఞాపకం వచ్చినప్పుడు శాంతిగా ఉండండి. అలా ఉంటే వారిపట్ల మీకు ఎంత సహృదయం ఉందో, ఎంత సదభిప్రాయం ఉందో దానిని చనిపోయిన జీవులు ఎక్కడ ఉన్నా వారికి భగవంతుడు అందజేస్తాడు. హిమాలయాలకు వెళ్ళి సాధన చేసుకొంటాను అని చెపితే నీవు ఎక్కడికి వెళ్ళినా నీ మనస్సు, ఇంద్రియాలు నీకూడా వస్తాయి. నీవు ఎక్కడ ఉన్నావు అనేది ముఖ్యం కాదు. తత్వాన్ని అర్థం చేసుకొని హృదయాభిముఖంగా ప్రయాణం చేయాలి. అది సాధన. ఇప్పుడు మీరు ఆనందం గానే ఉన్నారు. ఇంటికి వెళ్ళిన తరువాత ఇంత లేటుగా వచ్చావు ఏమిటి అని మీ ఆయన అంటే ఈ ఆనందం అంతా పోతుంది. అంత అస్వతంత్రంగా జీవిస్తున్నాము. మనది ఒకరకమైన బానిస జీవితం. నీవు ఎవడో నీవు తెలుసుకొనే వరకు ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలో కూడా ఇటువంటి గొడవలు తప్పవు జీవితంలో అనుకూల సంఘటనలు జరిగినా, ప్రతికూల సంఘటనలు జరిగినా ఎవడైతే తన మనస్సును, తన ఇంద్రియాలను లాగి పట్టుకుంటున్నాడో వాడు స్థితప్రజ్ఞుడు అవుతాడు.

నీ హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకోవడానికి ఏదైతే అడ్డువస్తోందో..దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. అదే సాధన, ఆ సాధన చిరాకుగా చేయకూడదు పరాకుగా చేయకూడదు, హితవుగా చేయాలి. రైలులో ప్రయాణం చేస్తున్నాము అనుకోండి, ఇంకా రాలేదు ఇంకా రాలేదు అని రైలులో ఏడుస్తూ కూర్చుంటే హైదరాబాద్ తొందరగా వచ్చేయదు. శాంతిగా, సుఖంగా కూర్చోండి. హైదరాబాద్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తుంది. అలాగే మాకు ఇంకా జ్ఞానం రాలేదు అని ఏడుస్తూ కూర్చోవద్దు. జ్ఞానం కోసం సంతోషంగా ప్రయత్నం చేయండి, భగవంతుడు మీకు కనిపించి మీకు వెయ్యి జన్మల వరకు మోక్షంరాదు అని చెప్పినా అప్పుడు కూడా మీకు ఏమీ అనిపించకూడదు. అలా ఉంటే వెంటనే మీకు మోక్షం ఇస్తాడు. అయ్యో వెయ్యి జన్మల వరకు మోక్షం రాదా అనికంగారు పడితే మూడు వేల జన్మలకు పెరుగుతుంది.

నీవు మాట్లాడేటప్పుడు మృదువుగా, హితవుగా, నిదానంగా మాట్లాడాలి. అది మీ సాధనలో ఒక భాగం అవుతుంది. అది మీ మనస్సుకు అంతర్‌దృష్టి కలుగజేస్తుంది. నీవు ఎవరి మీద అయినా అసూయపడుతున్నావు అనుకో ఆ అసూయను వెనుక్కు లాక్కోవటానికి నీకు పదిజన్మలు పడుతుంది. మనం అర్ధం చేసుకొని అభ్యాసం చేస్తే మనకు కష్ట సుఖాలు తెలుస్తాయి. పుస్తకాలు విషయాలు చెపుతాయి. వాటిని గ్రహించి, అర్ధం చేసుకొని ఆచరించి బాగుపడవలసింది నీవే. నీవు ప్రపంచం గురించి ఆలోచించటానికి అది ముఖ్యమైనది కాదు. దాని గురించి ఆలోచించి నీ కాలం వృధాచేసుకోవద్దు. ప్రపంచం అనుకొంటూ ఉంటుంది వాళ్లను గురించి వాళ్ళు తెలుసుకోవటం మానివేసి నాగురించి తెలుసుకొంటున్నారు. నాలో ఏదోసారం ఉందని నన్ను తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. నాలో సారం ఏముంది? అని ప్రపంచం ఎగతాళి చేస్తుంది. నీకు గ్రహించే శక్తి ఉంటే అది నీకు తెలుస్తుంది. ప్రపంచం గురించి ఆలోచించే బదులు నీవు ఎవడో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తే నీవు తొందరగా పునర్జన్మలో నుండి విడుదలపొందుతావు.

ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలనుకొనే వారికి, హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళాలనుకొనే వారికి సహనం, ముగింపు లేని సహనం, అత్యంత గాఢమైన సహనం అవసరం. దానికి సిద్దపడి ఈ మార్గంలో ప్రయాణం చేయాలి. రోజూ వందసార్లు టపాకాయలాగ పేలిపోతూ ఉంటే ఇంక మనకు జ్ఞానం ఏమిటి? నేను మహాత్ములను దర్శించాను, నేను సాధన చేసాను అని భగవాన్‌తో చెపుతూ ఉంటే నేను సాధన చేసాను, నేను సాధన చేసాను అంటున్నావు. ఆనేను ఎవడో నీకు తెలుసా అంటున్నారు భగవాన్. అది నీకు తెలియదు అదే అజ్ఞానం. అంటే మీరు చెప్పేది నాకు అర్ధంకావటంలేదు అంటున్నాడు. నీవు ఆలోచించు నీకు అర్ధమవుతుంది అంటున్నారు భగవాన్. అజ్ఞానం పెరగటానికి, మనం ఎవరో మనకు తెలియకపోవటానికి ఎవరో ఇతరులు కారణం కాదు. మన రూపం, మన నామం కారణం, దొంగనేను రూపంమీద, నామం మీద ఆధారపడి ఉంటుంది. ఈ రెండూ తీసివేస్తే అది అగాధంలో కూరుకొని పోయి పత్తా లేకుండా పోతుంది. నీకు ఎన్ని సమస్యలు ఉన్నా దొంగనేనును తీసి ఒక ప్రక్కన పెడితే అన్నీ పరిష్కారమయిపోతాయి. దొంగనేను ఉన్నంతకాలం అన్నీ ఉంటాయి. దానిని తీసివేస్తే అన్నీపోతాయి. రమణ మహర్షి ప్రత్యేకత ఏమిటి అంటే తాత్కాలిక ప్రయోజనం ఆశించడు, శాశ్వత పరిష్కారం కోసం చూస్తాడు. తత్కాలికమైన పనుల జోలికి పోడు. మనకు కష్టమైనా

శాశ్వత పరిష్కారం కోసం చూస్తాడు. ఆయన మంచి గురువు కాదు అని మనం అనుకొన్నా ఆయనకు నష్టంలేదు. దైనందిన జీవితంలో నీవు ఏపని విడిచిపెట్టనక్కరలేదు. పని విడిచిపెడితే జ్ఞానం రాదు. నీవు చేసే పనిలోనే మున్గుతూ రావాలి. అలా మున్గినప్పుడు సత్యం నీకు తెలియబడకుండా ఎలా ఉంటుంది.

ఇప్పుడు మాకు మోక్షం ఎందుకు? మా పని బాగానే ఉంది అని అనుకొంటున్నారా? ఇప్పుడు మనం ఉన్న స్థితి నిజమైతే మనకు దుఃఖం రాదు. కాని అది నిజం కాదు కాబట్టి మనకు దుఃఖం వస్తుంది. నిజంలోనుండి దుఃఖం రాదు, అనిజంలోనుండి దుఃఖం వస్తుంది. ఇప్పుడు మనం అనుభవించేది దొంగశాంతి. ఇడ్లీలో పచ్చడి బాగాలేకపోతే మనకు శాంతి అంతా పోతుంది. ఇది దొంగశాంతి. శాస్త్రలు చదువుతున్నాము. గీత చదువుతున్నాము కాని ప్రాక్టికల్ లైఫ్‌లో ఇలా ఉంటున్నాము. ఏది నిజమైన శాంతి అని భగవంతుడు గీతలో చెప్పాడు అంటే బాహ్యమైన కారణములు ఏ కారణం కూడా మీ శాంతిని కదపలేదో, కుదపలేదో అది నిజమైన శాంతి అని చెప్పాడు. చైతన్యస్రవంతి నీ హృదయంలో ఉంది. అందులోనికి వెళ్ళి కలిసిపో. అప్పుడు ఆనందమే ఆనందము. శాంతే శాంతి. అది స్వతంత్రంగా ఉంటుంది. అది నిజమైన శాంతి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 21-2-2000, గోగులమఠం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలంటే ముందు మీరు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. మీ కళ్ళతో మిమ్మల్ని చూసుకోండి, ఇతరులకళ్ళతో మిమ్మల్ని చూసుకోవద్దు. మీరు ఎన్ని శాస్త్రములు చదివినా ఆత్మవిశ్వాసం లేకపోతే మీకు మోక్షం రాదు. సహృదయంతోను, సద్బుద్ధితోను ఏ పని ప్రారంభించినా అది సఫలమవుతుంది. మన శరీరం పడిపోయిన తరువాత కూడా ఆపని అలా కంటిన్యూ అవుతుంది. ఎవరైనా మనలను విమర్శిస్తే మీకు విమర్శించే శక్తి ఉన్నా, విమర్శించటానికి తగిన కారణములున్నా విమర్శించకూడదు. అలా విమర్శించటం వలన రజోగుణం పెరుగుతుంది. ధర్మాన్ని ఆచరించటం వలన, మనం చేయగలిగిన మంచి ఇతరులకు చేయటం వలన మనం పవిత్రులమవుతాము. మనం పవిత్రులమైతే లోపల ఉన్న పవిత్రమైన వస్తువు మనకు వ్యక్తమవుతుంది. నీలోపల సత్యవస్తువు ఉంది అని పెద్దలు చెపుతూ ఉంటే, శాస్త్రాలు చెపుతూ

ఉంటే ఆ మాట మీద మీకు విశ్వాసం లేనప్పుడు మీరు సాధన ఏమి చేస్తారు, దానిని ఎలా పొందుతారు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని ఆయన మీద విశ్వాసం పెట్టుకుంటే ఆ విశ్వాసమే మన సాదనకు పెట్టుబడి. మీ విశ్వాసం గాని, మీరు చేసే మంచిపనిగాని వృధాపోదు అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఈశ్వరసంకల్పం లేకుండా ప్రకృతిలో ఏమీ జరుగదు. మనకు ఉండవలసినంత వైరాగ్యం, వివేకం, విశ్వాసం లేవు. వాటిని మనం జాగ్రత్తగా అలవర్చుకోవాలి. రమణమహర్షి, రామకృష్ణుడు ఏ స్థితిని పొందారో ఆ స్థితిని మనం కూడా పొందవచ్చు. ప్రతీ చిన్న విషయానికి మనస్సును కంగారు పెట్టుకోకూడదు. జీవితం ఎప్పడూ ఒకరకంగా వెళ్ళదు. ఎందుచేతనంటే కేవలం అన్నంతినటానికి, బట్టలు కట్టుకోవటానికి, ఇంట్లో కూర్చోవటానికి మనం ఇక్కడకు రాలేదు. జీవితంలో జరిగే సంఘటనలనుండి, సమాజంలో జరిగే సంఘటనలనుండి మనం చేర్చుకోవలసిన పాఠాలు ఎన్నో ఉన్నాయి. మీరు అభివృద్ధి పొందుతూ ఉంటే మిమ్మల్ని చూసి అనేకమంది పాఠాలు నేర్చుకొంటారు. ఒకవేళ వారు నేర్చుకోకపోయినా మీకు నష్టంలేదు. మీరు తరిస్తారు.

భగవంతుడు లేడు, పునర్జన్మ లేదు అని ఎవడైనా చెబుతూ ఉంటే ఆ మాటలు నిజం అనుకొని ఆ మాటలకు మీ మనస్సులో కొంత చోటిస్తే మీరు పనికి రారు, మీకు భవిష్యత్ లేదు. మనకు పెంకితనం ఉండకూడదు గాని పట్టుదల ఉండాలి. ఎవరైనా ఏదైనా సలహా చెబుతూ ఉంటే అందులో మంచి ఉంటే అది మనకు ఇష్టం లేకపోయినా అందులో మంచి ఉందని మీ బుద్ధి గ్రహించినపుడు దానిని ఆచరించటానికి ప్రయత్నం చేయాలి. ఈశ్వరుడి పట్ల విశ్వాసం కుదిరే కొలది మీ మనస్సు యొక్క చాపల్యం తగ్గుతూ ఉంటుంది. గాలిలేని చోట దీపం ఎలా ఉంటుందో ఈశ్వరుడి పట్ల విశ్వాసం కుదిరితే మనస్సు అంత నిలకడగా నిదానంగా ఉంటుంది. ఒక మనిషి ఎంత దురాచారుడు అయినప్పటికి వాడికి భగవంతునిపైన పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే వాడు తొందరగా బాగుపడతాడు. వాడు దురాచారంలోనుండి సదాచారంలోనికి వచ్చి వాడు తొందరగా బాగుపడే అవకాశం ఉంది. విశ్వాసానికి అంత బలం ఉంది. నేను బాగుపడటానికి ఏదైనా సలహా చెప్పండి అని మహమ్మద్ ప్రవక్తను ఒక భక్తుడు అడిగాడు. ప్రవక్త ఏమన్నాడు అంటే నీకు కారణం లేకుండా కోపం వస్తోంది, కారణం లేకుండా కోపం వస్తూ ఉంటే నేను చెప్పింది నీ బుర్రకు ఏమి ఎక్కుతుంది వుుందు అది తొలగించుకొనిరా అని చెప్పాడు. నీవు తొలగించుకోవలసిన దానిని తొలగించుకొని వస్తే నేను సలహా చెపుతాను అప్పడు ఆ మాట

యొక్క విలువ నీకు తెలుస్తుంది. అప్పుడు దానిని ఆచరించి బాగుపడతావు అని చెప్పాడు.

మీకు ఇష్టమైన దేవుని ఆరాధించండి. అంతేగాని మతాలు మార్చుకోవద్దు. మీ ఇంట్లో కావలసిన వస్తువులు అన్నీ ఉన్నప్పుడు ఇతరుల ఇంటికి వెళ్ళటం ఎందుకు. అలాగే మన మతంలో మోక్షం పొందటానికి సామాగ్రి అంతా ఉన్నప్పుడు ఇంకోమతం లోనికి వెళ్ళటం ఎందుకు? మీకు నచ్చిన భగవంతుని యొక్క రూపాన్ని గాని, మానవ గురువుని గాని ఆరాధించుకోండి. ఆయన చెప్పిన మాటలను ఆచరిస్తే, ఆయన చెప్పిన విధంగా జీవిస్తే మీ జీవితం బాగా జరిగిపోతుంది, మీరు బాగుపడతారు.

మనం తినే తిండి విషయంలోను కట్టుకొనే బట్టల విషయంలోను జాగ్రత్తగా ఉంటాము గాని వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండటంలేదు. మనిషిని నడిపేవి తలంపులే. తలంపును బట్టి శరీరం పనిచేస్తుంది. చెడు తలంపులకు పనిముట్టుగా ఈదేహం ఉంటే చీకటిలోకాలకు వెళతాము. మంచి తలంపులకు పని ముట్టుగా ఈ దేహం ఉంటే పుణ్యలోకాలకు వెళతాము. తలంపుల విషయంలో ఉండవలసినంత జాగ్రత్తగా మనం ఉండటంలేదు. మరణానంతరము మన తలంపులు మనకూడా వస్తాయి. ప్రతి తలంపుకు మనం సమాధానం చెప్పాలి. అందువలన తలంపుల విషయంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి. గురువు అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. దానిని పొందటానికి మనం తయారవ్వాలి. నదికి వెళ్ళినప్పుడు మనం చెంబు తీసుకొని వెళితే చెంబుతో నీరు తెచ్చుకోగలము, బిందె తీసుకొని వెళితే బిందెడు నీరు తెచ్చుకోగలము. నదిలో నీరు అంతే అని కాదు ఇంకా చాలా నీరు ఉంది మనం ఏది తీసుకుని వెళితే అంతే నీరు తెచ్చుకోగలము. గురువు అనుగ్రహం కూడా అంతే అది మన అర్హతనుబట్టి యోగ్యతనుబట్టి మనకు అందుతుంది. అందువలన అనుగ్రహాన్ని పొందటానికి తగిన అర్హత, యోగ్యత సంపాదించటానికి మనం ప్రయత్నం చేయాలి. ఎదుటి వారిలో ఉన్న మంచిని చూస్తే నేను మంచివాడను అవుతాను, ఎదుటి వారిలో ఉన్న చెడ్డను చూస్తే నేను చెడ్డవాడను అవుతాను. అందరి హృదయాలలోను ఉన్న భగవంతుని చూడటం నేర్చుకొంటే నాకు భగవదనుభవం కలుగుతుంది. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో ఆధ్యాత్మిక జీవితంలో ప్రవేశించాక భగవదనుభవం పొందాలనుకొనే సాధకుడు అంత జాగ్రత్తగా ఉండాలి.

మనస్సు అంటే అనేక తలంపుల యొక్క సమూహామే మనస్సు. మనస్సు అంటే ఒక

గడ్డితాడు వంటిది. గడ్డితాడులో ఉన్న గడ్డిపరకలను ఒకో దానిని తీసివేస్తే ఇంక గడ్డితాడు లేదు. అలాగే నీ మనస్సులో ఉన్న ఆలోచనలు, తలంపులను ఒకో దానిని తీసివేస్తే మనస్సు అనేది ఏమీ మిగలదు. నేను అందరి హృదయాలలో ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు కదా అక్కడనుండే మనస్సు ఉదయిస్తోంది. మనస్సు దాని మూలంలోనికి వెళ్ళే కొలది అది అణుగుతుంది. ఎవరి మీద అయినా రాగం వచ్చినా, ద్వేషం వచ్చినా మనస్సు విజృంభిస్తూ ఉంటుంది. మనస్సును నీవు అణుగు అంటే అది అణగదు. ఏ కారణాల వలన మనస్సు బాహ్యాముఖమవుతుందో ఆ కారణాలను తొలగించుకొంటే మనస్సు దాని అంతట అదే అణుగుతుంది. నిప్పలో పెట్టిన కట్టెలను ఒకోదానిని తీసివేస్తే మీరు నీరుపోసి ఆర్పనక్కరలేదు మంటదాని అంతట అదే ఆరిపోతుంది. అలాగే మనస్సు బాహ్యావుఖానికి వెళ్ళే కారణాలను ఒకో దానిని తొలగిస్తే అదే చల్లారిపోతుంది. రాగద్వేషములను తగ్గించుకొంటే మనస్సు అణుగుతుంది. మనస్సు చలించటానికి మన రూపం, నామం, కారణం. మీకు ఇష్టమైన భగవంతుని రూపాన్ని ఆరాధించండి. నామాన్ని స్మరించండి. అప్పడు మన నామ రూపములకు దూరమవుతాము. అప్పడు మనస్సు అణుగుతుంది.

మనస్సు అణిగిన వాడు ఎలా జీవిస్తాడు అంటే చచ్చిన వాడి వలె జీవిస్తాడు. అంటే వాడు పని చేయడు మొద్దుగా ఉంటాడని కాదు. వాడి పద్దతిలో వాడు పనిచేస్తాడు, వికారమువలన పనిచేయడు, మనస్సు అణిగినవాడు నిర్మలంగా ఉంటాడు, నిశ్చలంగా ఉంటాడు, సన్మానాలు చేస్తే పొంగిపోడు, దూషణలు చేస్తే కృంగిపోడు. దానికి సంబంధించిన రియాక్షన్ వాడికి ఉండదు. వాడికి యాక్షన్ ఉంటుంది గాని రియాక్షన్ ఉండనే ఉండదు. అందరి హృదయాలలో తననే చూసుకొంటూ ఉంటాడు. తన హృదయంలో అదరిని చూసుకొంటూ ఉంటాడు. మనస్సు అణిగిన వాడు అలా ఉంటాడు బేధం మనస్సులో ఉంది. మనస్సు దాటి వెళితే బేధం లేదు - మనస్సు అణిగిన వాడికి ఈ దేహం మనస్సుకు పనిముట్టుగా ఉండదు, లోపల ఉన్న ఈశ్వరుడికి పనిముట్టుగా ఉంటుంది. ఆ దేహం ద్వారా ఈశ్వరుడు పనిచేస్తాడు, ఆ దేహం దేవాలయం అవుతుంది. మనస్సు అణిగినవాడికి మనస్సు అణగని వాడికి తేడా ఎలా ఉంటుంది అంటే మనస్సు అణిగినవాడు ఎదుటి వారితో వ్యవహరించేటప్పడు శాంతిగా వ్యవహరిస్తాడు. ఎదుటి వాడు ఉద్రేకపడుతున్నాడు అనుకోండి నాకు మటుకు ఉద్రేకపడటం చేతకాదా ఏమిటి అని వీడు కూడా ఉద్రేకపడడు. ఎందుచేతనంటే అక్కడ మనస్సులేదు. మనస్సు అణిగిన

వాడు తన పద్ధతిలో తాను వ్యవహరిస్తాడు. కాని ఇతరులను అనుసరించడు. మనస్సు అణగనివాడు తనకు ఎవరైనా అపకారం చేస్తే తిరిగి అపకారం చేయడానికి సిద్ధంగా ఉంటాడు. మనస్సు అణిగినవాడికి మనం అపకారం చేసినా తిరిగి మనకు ఉపకారం చేస్తాడు గాని అపకారం చేయడు. ఎందుచేతనంటే అపకారం చేసే గుణం ఎప్పుడో చనిపోయింది కాబట్టి. భగవాన్‌ను కూడా కొంతమంది విమర్శించేవారు. మరల కొన్నిరోజుల తరువాత వచ్చి ఏదో పొరపాటున అలా అన్నాము ఏమీ అనుకోవద్దు అని చెప్పేవారు., నాకు మనస్సు ఉంటే నీవు ఏమీ అనుకోవద్దని చెప్పినా అనుకొంటాను. నీవు స్తోత్రం చేసినా, ధూషణ చేసినా అనుకోవటానికి ఇక్కడ ఎవడూ లేడు. వాడు ఏనాడో చనిపోయాడు. ఇక్కడ ఉన్నవాడు ఎవడో నీకు అర్ధంకాదు అని చెప్పేవారు. జ్ఞానం యొక్క వైభవం జ్ఞానంలేని వాడికి తెలియదు. ఎవరిని స్మరిస్తూ ఉంటే, ఎవడిని పూజిస్తూ ఉంటే మీ మనస్సుకు నిర్మలత్వం వస్తుందో వారిని ఆరాధిస్తారు గాని కోట్లు డబ్బు ఉన్నవాడిని వాడికి డబ్బు ఉంది కదా అని ఎవరూ ఆరాధించరు. ప్రపంచంలో ఉన్న సంపద అంతా మూటకడితే అది జ్ఞాని యొక్క శాంతి ముందు బలాదూర్ అంటే జ్ఞానికి అనుభవంలోనికి వచ్చిన శాంతితో ఆ సంపద పోల్చటానికి సరికాదు. మీకు మోక్షం కావాలంటే ఒక పద్ధతి చెపుతాను. మీకు లోకం మీద గౌరవం ఉందా. దేవుడు మీద గౌరవం ఉందా అని చూసుకోండి. లోకం మీద ఎంత గౌరవం ఉందో ఈశ్వరుడి మీద అంత గౌరవం ఉంటే ఈశ్వరుడే వచ్చి తన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. మీకు ఎవరి మీద గౌరవం వుందో చూసుకోండి. మీరు సమాజాన్ని మోసంచేయగలరు కాని ఈశ్వరుడిని మోసం చేయలేరు. మనకు ఎంతసేపు లోకం గౌరవం సంపాదించాలి అనే గాని భగవంతుని అనుగ్రహాన్ని సంపాదించాలి అనే ధోరణే మనకు లేదు.

కైలాసం ఎక్కడ ఉంది, వైకుంఠం ఎక్కడ ఉంది, స్వర్గం ఎక్కడ ఉంది అనే గొడవలు వద్దు. అవి అన్నీ అనవసరం. నీవు ఎందులో నుండి విడుదల పొందాలని శాస్త్రం చెపుతోందో ముందు అందులోనుండి విడుదల పొందు. ఆ తుక్కులో నుండి బయటకురా, తుక్కు అంటే బి.యమ్.ఐ అంటే శరీరము, మనస్సు, తెలివి వీటిలోనుండి బయటకు రా. రమణభక్తుడు ఒకడు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఢిల్లీలో ఉన్నప్పుడు అరుణాచలం వచ్చి మిమ్మల్ని చూడాలని ఉంటుంది. అరుణాచలం వచ్చాక ఢిల్లీ వెళ్ళిపోవాలని ఉంటుంది. ఇదేమి గొడవ అని భగవాన్‌ను అడిగాడు. గురువు అంటే శరీరం అనుకొంటున్నావు, గురువు అంటే దేహం కాదు. గురువు అంటే ఆత్మ. ఆత్మకి భిన్నంగా నువ్వు ఉన్నావనుకొన్నంత

కాలం ఈ తిప్పలు తప్పవు. ఒక స్థలంమీద కూడా ఎక్కువ వ్యామోహం పెట్టుకోకూడదు. అది కూడా నిన్ను బంధిస్తుంది, గురువు మీద ప్రేమ, ఆప్యాయత లోపల నుండి రావాలి. అది అంటించుకొంటే రాదు. జన్మాంతర అనుబంధం వలన ప్రేమ, ఆప్యాయత లోపల నుండి ఉబికి ఉబికి వస్తుంది. గురువు అంటే దేహం కాదు గురువు దేహం పోయిన తరువాత కూడా గురువుతో అనుబంధం పోదు. నిజమైనగురువు నీ లోపలే ఉన్నాడు. నిజమైన అరుణాచలం నీలోపలే ఉంది. కాని మనం వేరుగా ఉన్నాము. అరుణాచలం వేరుగా ఉంది అనుకొంటున్నాము. ఈ బేదబుద్ధి ఉన్నంతకాలం అరుణాచలం వెళ్ళటం, రావటం తప్పదు. ఈ గందరగోళం అంతా దేహబుద్ధిలోనుండి వస్తోంది. నీకు ఆత్మబుద్ధి కలిగే వరకు ఈ అల్లరి తప్పదు. రామకృష్ణుడు చెప్పిన మాటలు అన్నీ మహేంద్రనాద్ గుప్తా ఒక పుస్తకం వ్రాసారు. అంత పెద్ద పుస్తకం వ్రాసి ఆయన పేరుపెట్టుకోవటం ఆయనకు ఇష్టంలేదు. ఎవరు వ్రాస్తే ఏముంది. చదువుకొని బాగుపడటం ముఖ్యం అన్నారు. మనం పదిరూపాయలు చందా యిస్తే పెద్ద అక్షరాలలో వ్రాయాలి. ఇంక మన మనస్సు ఎలా అణుగుతుంది. మనకు దేవుని కంటే మన నామం, మన రూపం అంటే ఎక్కువ ఇష్టం ఇంక మన మనస్సు ఎలా అణుగుతుంది. దేహానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యత కంటే అతిగా ఇవ్వటం వలన మనస్సు అణగటం లేదు. నా భవిష్యత్ ఎలాగ ఉంటుంది అని భగవాన్‌ను అడిగితే ఇప్పుడు ఎలాగ ఉన్నావో భవిష్యత్‌లో కూడా అలాగే ఉంటావు అని చెప్పారు. మీరు సాధన చేసి ప్రకృతి గుణాలనుండి బయటకు రావాలి గాని ఏమీ చేయకుండా వచ్చే జన్మలో ఎలాగ ఉంటాముఅంటే ఈ జన్మలో ఎలాగ ఉన్నావో వచ్చే జన్మలో కూడా అలాగే ఉంటావు. నీవు సాధన చేస్తే కదా ఉత్తమ జన్మలు వచ్చేది.

మిమ్మల్ని ఎవరైనా పొగుడుతూ ఉంటే పాయసం నోటిలో పోసుకున్నట్లు ఉంటుంది. అలా మిమ్మల్ని పొగడకుండా నిర్మాణాత్మకమైన మంచి సలహా చెపుతున్నారు అనుకోండి. అది మీకు ఇష్టం లేకపోయినా దానిని మీరు స్వీకరించాలి. అప్పుడు మీరు వివేకవంతులవుతారు. కొంతమంది ఎంత డబ్బు ఉన్నా చాలా నిరాడంబరంగా ఉంటారు. ఎదిగే కొలది ఒదిగి ఉన్నవాడికి అది అభివృద్ధిలోనికి వస్తుంది. మీకు ఏదైనా గౌరవం వచ్చినా దానిని ఇముడ్చుకోవాలి. గౌరవాన్ని ధనాన్ని ఇముడ్చుకోలేనప్పుడు మీకు జ్ఞానం ఎలా కలుగుతుంది. మీకు కోరికలు ఉంటే భగవంతుడు నెరవేరుస్తాడు. నెరవేరినప్పుడు సంతోషిస్తే రజోగుణం పెరుగుతుంది. నెరవేరినా, నెరవేరకపోయినా సమానంగా ఉంటే సత్వగుణం పెరుగుతుంది. గుణాలలోనే మాయ ఉంది. ఈ గుణాలలో నుండి ఎవడు

బయటకు వస్తాడు అంటే భగవంతుని పాదాలను ఆశ్రయించినవాడు బయటకు వస్తాడు. గుణాలనుండి బయటకు వచ్చిన తరువాత పొందవలసింది పొందుతాడు. అన్ని మంచి పనులు మనం చేయలేము. ఎవరైనా మంచి పనులు చేస్తే మనం సంతోషించాలి. అలా సంతోషించటం వలన అందులో వాటా మనకు భగవంతుడు ఇస్తాడు. అది చూసి అసూయపడితే వారిలో ఉన్న దోషాలను మనకు ట్రాన్స్ఫర్ చేసి మనలను అనుభవించమంటాడు.

భగవాన్ యాత్రలు ఏమీ చేయలేదు. ఎందుచేతనంటే ఆయనకు సృష్టిలేదు. నీ తలను గోడకు పెట్టి కొట్టుకొంటావు అనుకో తాడు పాము అవుతుందా అనేవారు భగవాన్, అంటే దాని అర్థం ఏమిటి అంటే లోకం ఆత్మ అవుతుందా అని చెప్పటం. లోకం లేదు అని చెప్పాడు లేనట్లుగా జీవించాడు వాడు భగవాన్. కాశీకి పంపమని భగవాన్ తల్లి భగవాన్‌ను అడిగేది. కాశీ అంటే రెండు అక్షరాలు, ఆ రెండు అక్షరాలు మర్చిపోతే ఏమీలేదు అనేవారు భగవాన్. ఈ శరీరం ఉండగానే రాగద్వేషముల వేగం తగ్గించుకొంటే మనస్సు అణుగుతుంది. రాగద్వేషములు ఉంటే మనస్సు అణగదు. మనస్సుకు ఆధారంగా ఉన్న రాగద్వేషములు తీసివేస్తే మనస్సు వెళ్ళి హృదయ గుహలో పడి అది నశిస్తుంది. అప్పుడు గుహలో ఉన్న ఈశ్వరుడు తన స్వరూపాన్ని నీకు ఇస్తాడు.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 4-3-2000, చించినాడ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భక్తులు భగవంతుడిని ఎంత ప్రేమిస్తారో అంతకంటే ఎక్కువగా భగవంతుడు భక్తులను ప్రేమిస్తాడు. మనకు ఎంతో కొంత భగవంతుని మీద ప్రేమ ఉంటుంది. భగవంతుని ప్రేమిస్తున్నాము అనుకొంటాము. ఆయనను మనం ప్రేమించిన దానికంటే ఆయనే మనలను ఎక్కువగా ప్రేమిస్తాడు అది మన గుర్తింపుకు రావటం లేదు. శివనామం చేదా అని ఇప్పుడు ఎవరో పాటపాడారు. నిజంగానే కొంతమందికి చేదుగా ఉంటుంది. సహజంగా హృదయంలో దైవీసంపద లేకపోతే భగవంతుని నామం చేదుగానే ఉంటుంది. శివనామం అందరికీ చేదుగా ఉండదు. హృదయంలో నిర్మలత్వం లేనివాడికి, ధర్మంయందు గౌరవం లేనివాడికి శివనామం చేదుగానే ఉంటుంది. రాళ్ళతో, రప్పలతో గుడులు కడుతున్నారు. ఒక మనిషి యొక్క హృదయాన్ని దేవాలయంగా చేయటానికి ఎంతమంది ప్రయత్నం చేస్తున్నారు. మన దగ్గర డబ్బు ఉంటే గుడులు కట్టవచ్చు.

దేవాలయాలు కట్టటం తేలిక, మానవుడి యొక్క హృదయం దైవమయం చేయటం చాలా కష్టం. భక్తులను గౌరవిస్తే భగవంతుడిని గౌరవించినట్లు. భక్తుడిని అగౌరవపరిస్తే భగవంతుడిని అగౌరవపరిచినట్లు. మీ శరీరాన్ని మీరు ఎలా చూసుకొంటున్నారో భక్తుడి శరీరాన్ని భగవంతుడు తన శరీరంగా చూసుకొంటాడు. శరణాగతి వలన భక్తుడు భగవంతుని రక్షణ పొందుతాడు. తల్లికి బిడ్డ మీద ఎంత ప్రేమ ఉంటుందో భగవంతుడికి భక్తుని మీద అంత ప్రేమ ఉంటుంది.

శివుడుకంటే గొప్పవాడు గురువు. చెరుకు గెడ కంటే చెరుకు గెడలో ఉన్న రసం గొప్పది. శివుడు చెరుకుగెడ అయితే అందులో ఉన్న రసం సద్గురువు. భగవంతుడు జీవుడు చేసిన పుణ్యం, పాపం చూడవచ్చు గాని గురువు చూడడు. దైవం శిక్షించవచ్చు, గురువు శిక్షించకుండా మన పొరపాట్లను సరిచేస్తాడు. రామకృష్ణుడు ఎవరి గురించో చెపుతూ అతనికి సహృదయం ఉంది, మంచి వాడు అని చెప్పాడు. ప్రక్కన ఉన్నవాడు ఏమన్నాడు అంటే స్వామీజీ వాడు మంచి వాడు అయితే అయి ఉండవచ్చు కాని సారా త్రాగుతున్నాడు అని చెప్పాడు. అప్పడు రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే వాడు సారా త్రాగుతుంటే త్రాగవచ్చు కాని సహృదయం ఉన్నవాడే. వాడి మీద ఉన్న నా ప్రేమ వాడితో తాగుడును మింగేస్తుంది. వాడి మీద ఉన్న నా ప్రేమ వాడి తాగుడును నా కళ్ళకు కనిపించనివ్వటంలేదు. నా ప్రేమ వాడిచేత సారా మానిపిస్తుంది. వాడు గురువు. వాడు సారా త్రాగుతున్నాడు అని శివుడు వాడికి శిక్ష వేయవచ్చు కాని గురువు ఏమంటున్నాడు అంటే వాడి మీద నాకు ఉన్న ప్రేమ వాడి అలవాట్లను కప్పేస్తోంది, నా ప్రేమే వాడి చేత సారామానిపిస్తుంది. ఇప్పడు గురువు గొప్పవాడా, దేవుడు గొప్పవాడా. మీ పిల్లలు పొరపాట్లు చేస్తే మీరు సరిచేస్తారు అలాగే మనం పొరపాట్లు చేస్తే గురువు సరిచేయటానికి చూస్తాడు, కపటం లేని హృదయం ఉంటే ఆయన సంతోషిస్తాడు, ఆనందిస్తాడు. నరేన్ లేనప్పడు మీకు నరేన్ మీద ఎందుకు అంత ప్రేమ అని రామకృష్ణుడిని అడిగేవారు. వాడికి స్వార్థంలేదు, కపటం లేదు, మోహం లేదు వాడిని ప్రేమించకపోతే ఎవడిని ప్రేమిస్తాను ఈ సృష్టిలో అన్నాడు రామకృష్ణుడు. నరేన్‌ను చూసి సంతోషిస్తున్నాడు, ఇంకో సారా త్రాగేవాడిని చూసి వాడి అలవాటును నా ప్రేమ మింగేస్తుంది అంటున్నాడు. వాడు గురువు, భగవంతుడు కర్మఫలదాత. నీవు చేసే పుణ్య పాపములకు తగిన ఫలితం ఇస్తాడు. గురువు అలాకాదు. నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తే అభివృద్ధిలోనికి వచ్చినట్లు చూస్తాడు, రాకపోతే రానట్లు చూస్తాడు దేవుడు తీర్పు చెపుతాడు. కాని గురువు తీర్పు చెప్పడు. ఏ కారణములవలన మన మనస్సు

బాహ్యముఖానికి వస్తోందో ఆ కారణములను మింగేయటానికి చూస్తాడు వాడు గురువు.

నీవు భగవద్గీత ఎన్నిసార్లు చదివినా నీలో త్యాగబుద్ధి లేకపోతే అది నీకు అర్థంకాదు. మనం చేసే పనిని విడిచిపెట్టమని భగవంతుడు గీతలో చెప్పలేదు. ఇంట్లో చేసేపనినే మమకారబుద్ది లేకుండా వైరాగ్యబుద్దితో చేయండి. అలా చేస్తూ ఉంటే పని అయిపోతుంది, నీలో పునర్జన్మను తీసుకొని వచ్చే కారణాలు ఉంటే నశిస్తాయి. నేను హిమాలయాలకు రాలేను, నాదగ్గర డబ్బులేదు, మావూరిలో ఉన్న గుడికి వెళ్ళి వస్తాను అని ఒకరు పాట పాడారు. బాబాగారు ఏమిచెప్పారు అంటే నేను షిర్డీలోనే ఉన్నాను, ఇంక ఎక్కడా లేను అనుకొంటే వారు నన్ను అగౌరవపరచినట్లు అని చెప్పారు. హిమాలయాలలో దేవుడు ఉంటే, ఇక్కడ లేకపోతే వాడు దేవుడు ఎలా అవుతాడు. దేవుడు అంతటా ఉన్నాడు, అన్ని కాలాలలో ఉన్నాడు. పూర్వజన్మలనుండి వస్తున్న బరువులు భారాలు ఈ జన్మలో ఉన్నటువంటి బరువులు భారాలు తీసి ఒక ప్రక్కన పెడితేనే గాని భగవంతుని మీద ప్రేమ కలుగదు, భక్తి కలుగదు. పూర్వ జన్మలనుండి అనేక వాసనలు నీకూడా వస్తున్నాయి. అవి తీసి ఒక ప్రక్కన పెడితే అప్పుడు నీవు వర్తమాన కాలాన్ని బాగా ఉపయోగించుకొంటావు. భగవాన్‌ను నీవు శివుడివా, విష్ణువువా, కుమారస్వామివా అని అడిగితే నేను శివుడిని కాదు, విష్ణువుని కాదు అందరి హృదయాలలో ఉన్న చైతన్యాన్ని నేను అన్నాడు. అయితే అది నీ మనస్సుకు అందదు. ఎవడికైతే మనస్సు అణిగిందో , ఎవడికైతే రాగబుద్ధి, ద్వేషబుద్ధి లేదో వాడికి అందుతుంది. మానవుడు భౌతికంగా గాని, అధ్యాత్మికంగా కాని అభివృద్ధిలోనికి రావటానికి ఏకాగ్రత పవిత్రత, తెలివి వివేకం అవసరం. ఉపాసన వలన ఇవి వస్తాయి. భగవంతుడు అంటే ఇలా ఉంటాడు కదా అని ఆయనకు సంబంధించిన జ్ఞానం కలిగితే మనకు ఆయన మీద ప్రేమ కలుగుతుంది లేకపోతే అయన మీద ప్రేమ కలుగదు. ప్రకృతిలో పుట్టింది ప్రతీదీ చావుపైపుకు పరుగెడుతుంది. చనిపోతుంది కాని మనకు తెలియదు. మనకు దొంగనేను మీద ఉన్న ప్రేమ, లోకం మీద ఉన్న ప్రేమ మన హృదయంలో ఉన్న పరమేశ్వరుడి మీద లేదు. దొంగనేను మనలను మాయచేస్తోంది. అందుచేత మనందరము అజ్ఞానములో ఉన్నాము. ఎవడైతే దొంగనేనును మాయచేస్తాడో వాడు జ్ఞాని అవుతాడు. అప్పుడు వాడికి లోకం కనిపించినా, కనిపించకపోయినా దేహం ఉన్నాలేకపోయినా వాడికి ఆ గొడవ ఉండదు.

ఉన్న వస్తువు ఒక్కటే అంటున్నారు కదా మరి ఈ లోకం, మీరు, నేను చావు పుట్టుకలు,

అవిద్య ఈ గందరగోళం అంతా ఏమిటి అని ఒకరు అడిగారు. అప్పుడు ఏమి చెప్పాను అంటే ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అది నీకు అనుభవంలోనికి వచ్చాక అప్పుడు నీవు చెప్పేది ఏదీ లేదు అని నీకు తెలుస్తుంది. అది నీకు అనుభవంలోనికి రాదు అనుకో నీవు నేను ఎంతసేపు చర్చించుకొన్నా నీకూతెలియదు, నాకూ తెలియదు. భగవంతుడు ఉన్నాడా లేడా, లోకం ఉందా లేదా అని ఇలా ఆలోచించుకొనే బదులు దొంగనేనును మాయచేసుకోరాదా అన్నారు భగవాన్. అక్కరలేని గొడవలలోనికి వెళ్ళి కాలాన్ని వ్యర్థం చేసుకొనే బదులు దొంగనేనులో నుండి బయటకు రావటానికి ప్రయత్నించండి. రాగద్వేషములు నీలోపల ఉన్న శత్రువులు, ఎవరైతే నీక్షేమం కోరరో వారు బయట ఉన్న శత్రువులు, దొంగనేనులో నుండి విడుదల పొందితే బయట ఉన్న శత్రువులలో నుండి, లోపల ఉన్న శత్రువులలోనుండి శాశ్వతంగా విడుదల పొందుతావు. లోపల ఉన్న శత్రువులను, బయట ఉన్న శత్రువులను కల్పించేది దొంగనేను. ఈ దొంగనేనును నాశనం చేస్తేగాని ఈ శత్రువులనుండి విడుదల పొందలేవు.

ఓర్పు, సహనం లేనివాడికి మనస్సుకు అంతర్‌దృష్టి కలుగదు. మనస్సుకు అంతర్ దృష్టి కలుగకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం లేనివాడు సుఖికాలేడు, పునర్జన్మ నుండి విడుదల పొందలేడు. దేహము ఆత్మకాదు. మన మాట వలన, మన తలంపు వలన దేహమే ఆత్మ అనే బుద్ధి పెరుగుతూ ఉంటే నీవు అజ్ఞానములోనుండి, మాయలో నుండి బయటకు రాలేవు. నీకు తెలియని దాని గురించి ఎందుకు ఊహిస్తావు. మోక్షంగురించి నీకు తెలియదు., నీ దుఃఖానికి ఏదైతే కారణమోదానిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. తరువాత అయ్యేది ఏదో అవుతాం. నేను ఇంతటి వాడిని అనుకోవద్దు, నేను అంతటివాడిని అనుకోవద్దు. నేను ధనవంతుడిని అనుకోవద్దు, నేను .పేదవాడిని అనుకోవద్దు, ఇవి అన్నీ తలంపులే చైతన్యానికి తలంపులేదు నీవు అలాగ అనుకోవద్దు, ఇలాగ అనుకోవద్దు. ఏదీ వద్దు. నీవు ఎలాగ ఉన్నావో అలాగే ఉండు. ఎవరైనా ఉపవాసములు చేసి వచ్చి కూర్చొంటే మీ బాధ చూడలేకపోతున్నాను వెళ్ళి గుప్పెడు మెతుకులు తిని వచ్చి కూర్చోండి అనే వారు రామకృష్ణుడు. మీ శరీరాలను పీడించకండి, తగు మాత్రంగా తిని రండి అనేవారు. మీ ఉపవాసాల వలన వచ్చే బాధ నేను చూడలేకపోతున్నాను అనేవారు. గురువుకు భగవంతుడికి తేడా చూడండి. ఒకో మనిషిని ధనం అకర్షిస్తుంది. ఒకో మనిషిని అధికారం ఆకర్షిస్తుంది. ఒకో మనిషిని ఒకో విషయం ఆకర్షిస్తుంది. ఆ విషయంలో ఏదో బలం ఉంది అని మనం అనుకొంటున్నాము కాని

దానికి బలం లేదు. దానికి బలం మనమే ఇస్తున్నాము అన్న సంగతి మనకు తెలియటంలేదు. ఇదే మాయ.

మన శరీరం మీద ఉన్న నమ్మకం పరమేశ్వరుడిమీద లేదు. ఎన్ని నదులలో మునిగినా, చెట్లు చుట్టూ తిరిగినా, ఎన్ని దేవాలయాలు నిర్మించినా మనస్సు హృదయంలో నిలబడి ఉన్నప్పుడే ఆత్మజ్ఞానం కలుగుతుంది, లేకపోతే కలుగదు. ఆత్మనీ హృదయంలో ఉంది. ఎక్కడయితే ఆత్మ ఉందో, ఎక్కడయితే జ్ఞానం ఉందో అక్కడ నీ మనస్సును ఉంచటం వలన జ్ఞానం కలుగుతుంది గాని లేకపోతే జ్ఞానం నీకు అందనే అందదు. ఇప్పుడు మనం ఎండలో ఉన్నాము. ఎక్కడో చెట్టు ఉంది. ఆచెట్టు దగ్గర నీడ ఉంది. ఎండలో ఉన్నాము, ఎండలో ఉన్నాముఅనుకొని బాధపడే బదులు ఆ చెట్టు దగ్గరకు వెళితే ఆ నీడ మనకు దొరుకుతుంది. అలాగే మనం ఇప్పుడు విషయాలలో ఉన్నాము. విషయాలలో ఉండి బాధపడేబదులు హృదయంలోనికి వెళితే ఆత్మతాలూకు సుఖం శాంతి, జ్ఞానం మనకు అందుతుంది. హృదయంలోనికి వెళ్ళగలిగితే , అక్కడ ఉండగలిగితే అదే తపస్సు, అదే యోగం. అన్ని సుఖాలలోనికి ముక్తి సుఖం ఉత్తమమైనది. ముక్తి సుఖం పొందినవాడు విషయ సుఖాలను ఎప్పుడు పొందుదామని చూడడు. నీ మాట, నీచేత, నీ తలంపు నీ చైతన్య స్థాయిని పెంచే విధంగా ఉండాలి, రెండోవైపు లోకానికి ఉపయోగపడాలి. నీకు హోలీకంపెనీ దొరికినప్పుడు ఇతర నియమాలతోను, సాధనలతోను పనిలేదు విగ్రహాలను పూజించటం, నదులలో మునగటం, గుడులచుట్టూ తిరగటం ఇవి అన్నీ మంచివే. ఇవి ఎంతో కొంత మనస్సును పవిత్రం చేస్తాయి కాని చాలా టైము పడుతుంది. కాని మహర్షుల సన్నిహితత్వం వలన నీకు ఆధ్యాత్మిక పురోభివృద్ధి వేగంగా ఉంటుంది. పరమ పవిత్రుడు నిన్ను ఒక్కసారి స్మరిస్తే చాలు నీవు తరిస్తావు. జాగ్రదవస్థలో నిద్రసుఖాన్ని ప్రాక్టీసు చెయ్యండి. మీలోపల ఉన్న వస్తువు మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు ఎరుకపడే వరకు ఇష్టము, అయిష్టము తప్పదు, ఆకారాలు వికారాలు తప్పవు. ఏ వస్తువుకైతే మరణం లేదో ఆ వస్తువు మనకు అనుభవంలోనికి వచ్చేవరకు ఈ చావు తప్పదు, పుట్టుక తప్పదు. పని చేయండి. ఆతృతగా చేయకండి, మమకారంతో చేయకండి. వైరాగ్యంతో చేయండి . వైరాగ్యముతో చేసిన పని మీకు జ్ఞానం కలగటానికి సహకరిస్తుంది. దేహాన్ని ప్రారబ్దానికి వదిలెయ్యి. ఈ భూమి మీదకు దేహం ఎందుకు వచ్చిందో ఆ పనిచేసుకొని అది చనిపోతుంది. ఏ తలంపు అయితే నీ దేహంతో తాదాప్యం చెందుతోందో ఆ సమస్యను పరిష్కారం చేసుకో ముక్తి సుఖాన్ని పొందుతావు. నీవు ఏ పని చేసినా ధర్మబుద్ధితో చెయ్యి, ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకో. నంది ధర్మదేవత, ఎంత సేపు శివుడినే చూస్తాడు, మన వంక చూడడు. ఆ చూపు మనం నేర్చుకోవాలి. ఈశ్వరుడిని శరణాగతి వేడుకోవటం వలన మన జీవితాన్ని ఎక్కడ ఎలా మలుపు తిప్పాలో ఆయను చూసుకొంటాడు.

29-03-2000

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26,27-2-2000, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

చలించేది మనస్సు చలించేది అహంభావన. చలనం లేనిది ఆత్మ, చలనం లేనిది చైతన్యం. చలించే మనస్సును చలనంలేని స్థితికి తీసుకొని వెళితేనే గాని బ్రహ్మంలో నిలబడదు, బ్రహ్మాకారం చెందదు. బ్రహ్మాకారం చెందితేనే గాని మనకు బేధబుద్ధి నశించదు, కర్తృత్వబుద్ధి నశించదు. మానవుడికి ఎంత ధనం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా కర్తృత్వబుద్ధి ఉన్నవాడికి దుఃఖం వెంటాడుతూ ఉంటుంది ఈ లోకంలోనే కాదు, పరలోకంలో కూడా. నేను కష్టపడి సంపాదించుకొంటున్నాను. నా సంపదను దొంగలు పట్టుకొని పోతున్నారు. మరల సంపాదించుకొంటున్నాను. మరల దొంగలు పట్టుకొని పోతున్నారు. ఇలా జన్మజన్మలు జరిగిపోతున్నాయి ఎప్పుడు తరిస్తానో అన్నారు షిర్డిబాబాగారు. సంపాదన అంటే అభ్యాసము, వైరాగ్యము. నేను అభ్యాసం చేస్తున్నాను, వైరాగ్యం సంపాదించుకొంటున్నాను, తపస్సు చేసి పుణ్యం సంపాదించుకొంటున్నాను. ప్రపంచంలో ఉన్న భోగాలు, ఇంద్రియఆకర్షణలు నా అభ్యాసమును, వైరాగ్యమును పట్టుకొని పోతున్నాయి. భోగాల మీద తిరగబడి వాటిని కొట్టి నా సంపద నేను తిరిగి తెచ్చుకొంటున్నాను. అవి దెబ్బలు తిని నామీద కక్ష పెట్టుకొని తిరిగి నా అభ్యాసం, వైరాగ్యంలను పట్టుకొని పోతున్నాయి. జన్మజన్మలకు ఇలా జరుగుతోంది. కాళ్ళు బాడి చేసుకోవటం, కడుక్కోవటం, సంపాదించుకోవటం, పోగొట్టుకోవటం ఇలా ఏ జన్మకు ఆ జన్మ జరుగుతోంది. ఇంక ఉద్ధరింపబడటం ఎలాగ అంటే ఇంతవరకు నా సంపద పట్టుకెళ్ళినవాటిని కొట్టి తీసుకొని వస్తున్నాను కాని వాటిని చంపటం లేదు. వాటిని చంపితేనే గాని నా సంపద నిలబడదు అని ఒక నిర్ణయానికి వచ్చాను. చిత్త వృత్తులు, భోగవృత్తులు దొంగలు వాటిని కొడితే అణిగి ఉంటున్నాయి, తిరిగి మరల విజృంభిస్తున్నాయి. వాటిని పూర్తిగా చంపితేనే గాని ఈ దొంగతనం పోదు అప్పుడు గాని స్థిరత్వంరాదు, జ్ఞానం నిలబడదు అన్నారు బాబా.

యోగం అంటే ఏ కారణం వలన మీ మనస్సు బాహ్యముఖానికి వస్తోందో ఆ వృత్తిని, ఆ వాసనను నశింపచేయటవే యోగంయొక్క లక్ష్యం. ఏ విషయాలు అయితే దేహాభిమానాన్ని పెంచుతున్నాయో, ఏ వాసనలు అయితే ఈ శవానికి కట్టి ఉంచుతున్నాయో ముందు అందులో నుండి విడుదల పొందండి తరువాత మోక్షం ఎలా ఉంటుందో మీకు

అనుభవంలోనికి వచ్చాక తెలుస్తుంది. అది ఊహించేది కాదు. సత్యవస్తువు నీ హృదయంలో ఉంది. నీ మనస్సు అక్కడకు వెళ్ళి కరిగిపోతే అప్పుడు హృదయాకారం చెందుతుంది. అప్పుడు లోపలఉన్న వస్తువు నీకు అందుతుంది. నీ దేహబుద్ధిని త్యాగం చేయటంవలన అమృతత్వం తెలుస్తుందిగాని బాహ్యంగా నీసంతానం వలన గాని, ధనం వలనగాని, అధికారం వలన గాని అది దొరికేది కానే కాదు. నీ తెలివితేటల వలన మనస్సు అణగదు ఈశ్వరానుగ్రహం ఉంటే మనస్సు అణుగుతుంది. ఈశ్వరానుగ్రహం ఎప్పుడు కలుగుతుంది అంటేమన ఇష్టాన్ని ఒక ప్రక్కన పెట్టి ఆయనకు ఏది ఇష్టమైతే ఆ ఇష్టానికి సంబంధించిన జీవితం ఆచరిస్తూ ఉంటే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము. ప్రపంచంలో ఏ విషయంమీద మీకు ఆకర్షణ కలుగకపోతే వెంటనే మీ మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. దేహవాసన, శాస్త్రవాసన, లోక వాసన ఇవి మూడూ లేని వాడికి వాడి మనస్సే ఆత్మ అయిపోతుంది. మోక్షం మీ హృదయంలోనే ఉంది అయినా యోగం ఎందుకు అంటే అది అనుభవంలోనికి రాకుండా ఏచిత్తవృత్తి అడ్డువస్తోందో దానిని నశింపచేయటం కోసం యోగం. నీ యజమాని, నీ నిజమైన భర్త, నా గతిని నియమించేవాడు నీ హృదయంలోనే ఉన్నాడు. నీ మనస్సుకు, మాటకు, ఇంద్రియాలకు, నీ తెలివికి వాడు అందడు. నీ లోపల ఉన్న వస్తువును స్మరించటంవలన, దానిని ప్రేమించటం వలన, దాని గురించి శ్రవణం చేయటం వలన నీ లోపల ఉన్న పరమానందం మీ చేతికి అందుతుంది. పాయసం నోటిలో పెట్టుకొన్నప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అలాగ నీ లోపల ఉన్న వస్తువును ఎంజాయ్ చేయాలి. మీ బుద్ధికి సెంటర్ అదే అయ్యి ఉండాలి. మనం ఏదైనా ఊరు వెళుతున్నాము అనుకోండి మధ్యలో ఎవరైనా కనిపిస్తే ఆగి మాట్లాడతాము కాని గమ్యం మర్చిపోము. అలాగే లోకంలో వ్యవహరించేటప్పుడు కూడా సందర్భాన్ని బట్టి ఎవరితోనైనా మాట్లాడినా, ఏదైనా పని చేసినా నీ గమ్యం మాత్రం ఈశ్వరుడే. అది మర్చిపోకూడదు. నీ పతిని మర్చిపోకూడదు. విసుగు లేకుండా ఈశ్వరుని వైభవం గురించి వినాలి. విమానాన్ని హైజాక్ చేస్తున్నారు, అలాగే రాముడిలోని కళ్యాణగుణాలను మనం హైజాక్ చేయాలి. ఎదుటి వారిలో మంచి గుణాలు ఉంటే మనం వాటిని లాక్కోవాలి. కాని మనం ఏమి చేస్తున్నాము అంటే వాడిలో ఉన్న మంచి గుణాలు వదిలేసి వాడిలో దోషం ఉంటే అది చెపుతాము. చివరకు వాడి దోషం వచ్చి మనలను అంటుకుంటుంది. ఆ దోషంలోనుండి వాడు విడుదల పొందుతాడు. ఎదుటివారిలో ఉన్న మంచిని చూస్తూ ఉంటే మనం మంచివారము అవుతాము. ఎదుటివారిలో ఉన్న చెడ్డను చూస్తూంటే వారు

బాగుపడతారు, మనం చెడ్డవారమవుతాము అని బాబాగారు చెప్పారు.

ఎవరైనా నిన్ను విమర్శించవచ్చు. ఆ దోషం నిజంగా నీలో ఉంటే తొలగించుకోండి. ఆ దోషం మీలో లేకపోయినా వాడిలో దోషం నాకు తెలుసు అని ఆ దోషాలు చెప్పవద్దు. వారిని విమర్శించవద్దు. అప్పుడు నీ మనస్సుకు అంతర్ దృష్టి కలుగుతుంది. వారిని విమర్శిస్తే మటుకు నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. నీ మనస్సు అణగటానికి బదులు విజృంభిస్తుంది. గీత, ఉపనిషత్‌లు రోజూ చదవటం కాదు, ఇటువంటి విషయాలు అర్థం చేసుకొని ఆచరిస్తే ఆ విధంగా జీవిస్తూ ఉంటే మీకు జ్ఞానం కలుగుతుంది. రోజూ పారాయణాలు ముఖ్యం కాదు. ప్రాక్టికల్ లైఫ్‌లో మీకు ఏవైతే ఎదురవుతున్నాయో వాటిని పరిష్కరించుకోవటానికి ప్రయత్నం చేయండి. మనం జీవితంలో నేర్చుకోవలసిన పాఠాలు ఎక్కువ. మనం నేర్చుకోవలసిన పాఠాలు లేవనుకోండి మనకు జన్మేరాదు. మనం నేర్చుకోవలసింది ఉంది కాబట్టి జన్మ వచ్చింది. లోకం యొక్క సంతోషం కోసం, కీర్తి కోసం నీవు ఎంత పనిచేస్తున్నావో అలాగ దేవుని యొక్క సంతోషం కోసం నీవు పనిచేస్తే ఆయన అనుగ్రహానికి పాత్రుడవుతావు. అప్పుడు నీ హృదయంలో ఉన్న ఆనందం పొంగి నీ సహస్రారానికి అందుతుంది. అంతా ఈశ్వర సంకల్పం ప్రకారం నడుస్తోంది. కాని ఇది నావలననే అవుతోంది. ఇది నేనే చేస్తున్నాను అని నీకు అనిపిస్తోంది అనుకోండి అది నిజంకాదు, వాడి అజ్ఞానం వలన అలా అనిపిస్తోంది. భగవంతుని సంకల్పానికి అనుగుణంగా నడిచేవారు భక్తులు వారు బొమ్మలను ఎదురుగా పెట్టుకొని పూజించకపోవచ్చు. భగవంతుని సంకల్పాన్ని వ్యతిరేకించేవారు దురాత్మలు. భక్తుడు భగవంతుని సంకల్పానికి సహకరిస్తాడు. సహకరిస్తున్నాడు కాబట్టి ఆయన స్వరూపాన్ని వాడికి ఇస్తాడు. మీ హృదయంలో ఉన్న శాంతిని మీరు అనుభవిస్తున్నారు అనుకోండి మీకు శక్తి కలుగుతుంది. ఆ శక్తితోటి సమాజానికి మీరు ఎంతో కొంత ఉపకారం చేయవచ్చు. మనస్సు యొక్క చాపల్యం వలన దుఃఖం వస్తుంది. ఉపాసన వలన మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది, మనస్సునిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది. అప్పుడు ఆరాధించేది ఎవరు అని ఆలోచించు. అప్పుడు ఆరాధించే నేను అది ఎవరినైతే ఆరాధిస్తోందో వాడిలో అది కరిగిపోతుంది. అప్పుడు వాడు స్వరూపంగా, ఆత్మగా, నేనుగా కాకుండా తానుగా వ్యక్తమవుతాడు. విద్యలు రెండురకాలు. మనం కాలేజీలో చదివే విద్యలు క్షరవిద్యలు. క్షరవిద్య అంటే నశించే విద్య. మనస్సు ఎంత నిజమో ఈ విద్యలు కూడా అంతే నిజం. క్షరవిద్యల వలన పొట్టవెళ్ళిపోతుంది. మనస్సునశించి నప్పుడు ఈ

విద్యలు నశిస్తాయి. ఆత్మవిద్య అక్షర విద్య అంటే నశించని విద్య.

ఒక్కసారి నీకు ఆత్మానుభవం కలిగితే ఇంక దానికి నాశనం ఉండదు. ఎందుచేత నాశనం ఉండదు అంటే ఆ వస్తువుకు నాశనం లేదు. సృష్టి, స్థితి, లయాలు బ్రహ్మంలోనే జరుగుతున్నాయి. బ్రహ్మానుభవం పొందినవాడు సృష్టి స్థితి లయాలకు చిక్కడు, దొరకడు.

పంచభూతాలతోటి శరీరాలు తయారవుతాయి. వ్యవహారం కోసం దానికి ఒక పేరు పెడతారు. అదే సృష్టి. దానిలో నుండి విడుదల పొందితే జ్ఞానం. పంచభూతాలతోటి ఈ దేహం తయారయ్యిందని, వ్యవహారం కోసం దానికి ఒక పేరు పెట్టారని ఈ విషయం మన హృదయానికి తాకితే, మన బుద్ధికి అర్ధమయితే రూపం మీద, నామం మీద మోహంపోతుంది. అప్పటి వరకు రూపచింతన, నామచింతన ఉంటుంది. మన దేహప్రారబ్దంలో ఈశ్వరుడు మనకు ఏమి ఇస్తే అది అసహ్యంగా కాకుండా, అసభ్యంగా కాకుండా ఇష్టంగా, ప్రీతిగా, ప్రేమగా స్వీకరించి సంతృప్తి పడాలి. దేహ ప్రారబ్దమును బట్టి భగవంతుడు సుఖం ఇచ్చినా, దుఃఖం ఇచ్చినా తిరస్కార భావంతోకాకుండా పురస్కార భావంతో స్వీకరించాలి. ఇలా మనం అభ్యాసం చేస్తూ ఉంటే మనస్సు నశిస్తుంది. ఈశ్వర సంకల్పానికి ఎదురు తిరగకుండా ఉంటే మనకు శరణాగతి భావన కలుగుతుంది. మనకు తెలియకుండా మన మనస్సు నశిస్తుంది. వారు ఆతప్పు చేసారు, వీరు ఈ తప్పు చేసారు అని అనుకొంటాము. ఇన్ని తప్పులు లేవు ఉన్నది ఒక్కటే తప్పు అన్నారు భగవాన్. ఈ దేహం నేను అనుకొంటున్నాము. అంతకంటే పెద్ద తప్పు ఏముంది అది ఒక్కటే తప్పు. నేను అంటే మనకు బ్రహ్మం వ్యక్తం కావటం లేదు. నేను అంటే దేహమే మనకు వ్యక్తమవుతోంది. అంతకంటే పెద్దతప్పు ఏముంది. ఆ తప్పు ఉన్నప్పుడు మిగతా తప్పులు సహజంగా నీకు వస్తూనే ఉంటాయి. నీకు దేహబుద్ధి ఉన్నప్పుడు ఇతరులు కూడాదేహాలుగానే కనబడతారు. నీకు రాగద్వేషములు వస్తాయి. అప్పుడు మిగతా తప్పులు ప్రారంభమవుతాయి. దేహమునేను అనేది ప్రధమ తప్పు, పెద్ద తప్పు. ఈ తప్పును తొలగించుకొంటే ఇంక నీకు సాధన అక్కరలేదు. దేహబుద్ధి ఉన్నవాడు సహజంగా పొరపాట్లు చేస్తూనే ఉంటాడు. తెలిసి చేసినా, తెలియక చేసినా క్షమించమని భగవంతుని ప్రార్ధించాలి. మొదటితప్పులో నుండి విడుదల చేయమని మనం భగవంతుని ప్రార్ధించాలి. నేను అనే మొదటి తప్పును వదిలేసి ఎంత సాదన చేసినా నీవు బంధంలోనుండి బయటకు రాలేవు. దేవుడు ఉన్నాడని కొంతమంది దేవుడు లేడు అని కొంతమంది అంటున్నారు. ఆ గొడవవద్దు. నీదేహం, ఇంద్రియాలు, మనస్సు తెలుస్తున్నాయి కదా. నీ దేహాన్ని ఇంద్రియాలను, మనస్సును దేవుని వాక్యాలకు

అనుగుణంగా మల్చుకొని జీవిస్తే దైవానుభవం కలుగుతుంది. ఏ కారణం వలన ఈ దేహం వచ్చిందో ఆకారణాలు తొలగించుకొంటే మరల మనకు పునర్జన్మ రాదు. మనం ఆ కారణాలను తొలగించుకోకుండా కొత్త కారణాలను తెచ్చుకొంటున్నాము.

కర్మను యోగం చేసిన వాడికి ఫలితం వస్తుంది. అది వాడిని బంధించదు. కర్మను కర్మగా చేసిన వాడికి వచ్చే ఫలితం వాడిని బంధిస్తుంది. దాని వలన వాసన పుడుతుంది. విషయాల నుండి వారించి మన మనస్సును ఆత్మవైపుకు పంపేకొలది ఆత్మయొక్క రుచి మనస్సుకు తెలిసినప్పుడు అది ఆత్మనే చింతిస్తూ ఉంటుంది. చిత్తాన్ని నీ యోగసహాయం వలన వెనక్కి మళ్ళిస్తే దాని మూలంలోనికి వెళ్ళటం ప్రారంభిస్తుంది., అప్పుడు చిత్తము యొక్క మూలం నీకు తెలుస్తుంది. చిత్తము యొక్క మూలంలో ఏమి ఉంది? అక్కడే శాంతి ఉంది, ఆనందం ఉంది, బ్రహ్మం ఉంది. అది నీవే. కాని దానికి నీకు ఎంతో దూరం ఉందని నీ మనస్సు అనిపింపజేస్తోంది. చిత్తం దాని మూలంలోనికి వెళ్ళేటప్పటికి తత్వం తనంతట తానుగా నీకు దర్శనమిస్తుంది.

ఎవరైనా భగవాన్ దగ్గరకు వచ్చి ఉపదేశం ఇవ్వమని అడిగితే ఉపదేశం ఉపదేశసారంలో ఉందే అనేవారు భగవాన్. ప్రత్యేకంగా ఏమీ చెప్పనక్కరలేదు అనేవారు. అందులో మొదటి 15 శ్లోకాలు ఉపనిషత్ సారాన్ని, వేదాలలో ఉన్న సాంప్రదాయాన్ని చెప్పాడు మిగతా 15 శ్లోకాలలో తన హృదయాన్ని ఓపెన్‌చేసి మానవజాతిని జ్ఞానగంగతో తడిపాడు. చిత్తముయొక్క మూలం నీకు తెలియదు అనుకో నాకు దేవుడు కనిపించాడు అంటే నీ మనస్సు ఎంత నిజమో ఆ దృశ్యం కూడా అంతే నిజం. నీకు దేవుడు కనిపించవచ్చు, వరాలు ఇవ్వవచ్చు. కాలప్రవాహంలో ఇవి అన్నీ కొట్టుకొని పోతాయి. నీ దేహం ఎంత నిజమో, సుఖదుఃఖాలు ఎంతనిజమో, రాగద్వేషములు ఎంత నిజమో ఆ వరాలు కూడా అంతే నిజం. ఏదోదేహంలో అనుభవిస్తాము. కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి. నాదేహమే నాది కానప్పుడు ఈ వరాలు వలన వచ్చే ఫలితాలు నావి అని ఎలా అనుకొంటాను అన్నాడు బుద్ధుడు. దూడను కట్రాడుకు కట్టివేస్తే అలా పడివుంటుంది. అలాగే ఈ మనస్సు అనే పశువును ఏదో రూపానికి, ఏదో నామానికి కట్టి వేయటంవలన మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది. చాపల్యం ఎప్పుడైతే పోయిందో దాని మూలంలోనికి వెళ్ళిపోతుంది. మనస్సుకు ఆవరణదోషం, మలదోషం, విక్షేపదోషం అని మూడు దోషాలు ఉన్నాయి. ఈ మూడు దోషాలను పోగొట్టుకొంటే మనస్సు దాని మూలంలో పడిపోతుంది. ఏ విషయాలు అయితే నిన్ను బంధిస్తున్నాయో ముందు వాటిలోనుండి బయటపడు.

తరువాతనీవు పొందవలసింది ఏదో సహజంగా పొందుతావు. నీ హృదయంలో మనోమూలం ఎంత దూరంలో ఉందో అంత దూరం వరకు నీ మనస్సును ఉపసంహరించు. నీవు ప్రయత్నంచేసి మనస్సును దాని మూలంలోనికి పంపాలి. చివరిక్షణం వరకు, ఆవలివడ్డుకు చేరే వరకు ఆవలి వడ్డు అంటే ఆత్మ, నీవు జ్ఞానివి అయ్యేవరకు విసుగు లేకుండా, విరామం లేకుండా, ఇష్టంగా సాధన చేయాలి. మనస్సు ఏదైనా వస్తువును ధ్యానం చేస్తే అది అణిగి ఉండవచ్చు. కాని దాని మూలాన్ని అది చూస్తేనేగాని అది నశించదు. అది నశిస్తేనే గాని తత్వం తెలియబడదు. తత్వం తెలిస్తేనే గాని నీకు సుఖం లేదు, శాంతి లేదు.

ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో ఆ సమస్యను నీవు పరిష్కారం చేసుకోవాలి. ఆ నేనును నశింపచేయటం నిజవిచారణ గాని ఆ నేనును మినహాయించి పూజలు చేసాను, జపాలు చేసాను అంటే అది నిజవిచారణ కాదు. దాని వలన పుణ్యం రావచ్చు. దొంగనేను పుణ్యం యొక్క ఫలితాన్ని అనుభవిస్తుంది. తరువాత దొంగనేను మిగులుతుంది. దొంగనేను యొక్క మూలాన్ని అన్వేషించి దాని మూలంలో దానిని నశింపజేయటమే నిజవిచారణ గాని మిగతావి నిజవిచారణలు కాదు. సాధనలలో ప్రాణాయామం ఒకటి. దాని వలన మనస్సు అణుగుతుంది. కాని మనస్సు నశించదు. కొంత మంది ప్రకృతి చేస్తారు. ప్రకృతి చేసేటప్పుడు మనస్సు అణుగుతుంది. తరువాత ఇంటికి వచ్చాక కోరికలు విజృంభిస్తాయి. నానా గడ్డి తినేస్తారు. వీటి వలన ఏమీ ప్రయోజనం లేదు. పూజగదికే నీ మనస్సును పరిమితం చేస్తే మనస్సు నశించదు. దైనందిన జీవితంలో నీ మనస్సు అంటే ఏమిటి, దాని పోకడ ఏమిటి అని దానిని అర్ధం చేసుకొని దాని మూలంలోనికి మనస్సును పంపిస్తే అది నశిస్తుంది. ఒక భక్తుడు భగవాన్‌తో ఏమి చెపుతున్నాడు అంటే నేను హెడ్ మాష్టారు ఉద్యోగం చేస్తున్నాను. ఇతరులకంటే నేను ఎక్కువ పని చేయవలసి వస్తోంది. మనస్సును ఎక్కువగా ఉపయోగించవలసి వస్తోంది. అందువలన ఉద్యోగం వదిలేసి ఏకాంత ప్రదేశములోనికి వెళ్ళి తపస్సు చేసుకొని తరించాలని ఉంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవు ఉద్యోగానికి రాజీనామా ఇవ్వవద్దు. ఉన్నచోటనే ఉండు చేస్తున్నపనినే చేస్తూ ఉండు. నీవు చేసే పని మామూలుగా రోజూ చేసేదే కదా. మనస్సుకు జీవం పోసి నీ చేత పని చేయించేవాడు లోపల ఒకడు ఉన్నాడు. వాడిని జ్ఞాపకం పెట్టుకొని పని చేస్తే నీవు టైర్ అవ్వవు. పని చేయటం వలన మానవుడు టైర్ అవ్వడు. ఆ పని నేను చేస్తున్నాను అనే తలంపు వలన టైర్ అవుతాడు.


కర్త ఎవడో తెలిస్తే కర్తృత్వం పోతుంది. కర్తృత్వం పోతే టైర్ అవ్వవు. ఎక్కువ తింటే నిద్ర, తక్కువ తింటే నీర్సము ఎలాగైనా ప్రమాదమే. మధ్యేమార్గంలో ఉండు, యుక్తంగా తిను. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. విహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. స్నేహాలు ఎక్కువగా ఉంటే సాదన చెడుతుంది. నిర్మలంగా, నిశ్చలంగా ఉండి పనిచేస్తే నీలోపల పని చేయించే వాడు ఒకడు ఉన్నాడు వాడు పనిచేయించుకొని పోతాడు. భగవంతుడు ఎలా పని చేస్తున్నాడో మనం కూడా అలా పనిచేస్తే భగవంతుడు తన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. మనం లోకం సంతోషం కోసం పని చేస్తున్నాము గాని భగవంతుడు సంతోషం కోసం పని చేయటం లేదు. ఇంక మనకు జ్ఞానం రానేరాదు.

హెడ్‌మాష్టారుతో భగవాన్ ఏమంటున్నారు అంటే అందరూ హెడ్ మాస్టర్లు అయ్యారా? నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నువ్వు అయ్యావు. ఆపని పూర్తి చేసుకొని బయటకు రా. బలవంతంగా బయటకు వస్తే వచ్చే జన్మలో నీకు ఆ ఉద్యోగమే సిద్దమవుతుంది. ఏదైనా పని మనం ఇష్టంగా చేస్తే ఆ గొడవ వదిలిపోతుంది. ఇష్టంగా చేయకపోతే ఈ కర్మ మనకే మిటి అని అనుకొంటే రాబోయే జన్మలో ఆ కర్మే నీకు ఎదురవుతుంది. ఆ కర్మద్వారా నీవు కొన్ని అనుభవాలు పొందాలి అని ఉంది కాబట్టి ఈ శరీరం నీకు వచ్చింది లేకుంటే ఈ శరీరంతో నీకు పని ఏమిటి? మనం వంద సంవత్సరాలు జీవించినా ఈ శరీరం నాకు ఎందుకు వచ్చింది అని ప్రశ్న వేసుకొనేవాడు ఒక్కడు కూడా కనబడడు. నీవు నేర్చుకోవలసిన పాఠాలు లేవు అనుకో, పొందవలసిన అనుభవాలు లేవు అనుకో ఈ శరీరమే నీకు రాదు. నీవు చేసే పని చిరాకుగా చేయకు, పరాకుగా చేయకు నీవు చేసే పని శ్రద్దగా చెయ్యి, ప్రేమతో చెయ్యి కర్తృత్వం లేకుండా చెయ్యి. అది ధ్యానంతోటి సమానము. అది నీకు వికాశము కలుగచేస్తుంది. అది నీకు జ్ఞానోదయం కలగటానికి సహకరిస్తుంది. పాము విషం పిండేస్తాము అనుకోండి అది కరచినా ఏమీ చేయదు. నిష్కామకర్మ అటువంటిదే. ఎవడైతే నిష్కామకర్మ చేస్తున్నాడో వాడికి ఫలితం వస్తుంది గాని అది వాడిని బంధించదు.

పని నిర్మలంగా చేస్తున్నావు అనుకో. గుర్తింపుల కోసం చేయటం లేదు అనుకో, అప్పడు నీకు తెలియకుండానే నీలోపల ఉన్న సత్యంతో నీకు అనుబంధం ఏర్పడుతుంది., అనుబంధం ఎప్పడైతే ఏర్పడిందో చేసేవాడు నీవు కాదు అని నీకు తెలుస్తుంది. అప్పడు

నీవు టైర్ అయ్యే సమస్యేలేదు. ఎవడైతే నేను అనే తలంపు లేకుండా పని చేస్తున్నాడో వాడు మాత్రమే ఈ సృష్టిలో బుద్ధిమంతుడు. వాడు చేసినా చేయని వాడితో సమానము అని కృష్ణుడు గీతలో చెప్పాడు. నేను ఏదో కష్టపడి పోతున్నాను. ఏదో ఉద్ధరిస్తున్నాను అని అనుకోకు దాని వలన అహంభావన పెరుగుతుంది, వస్తువుకు దూరమవుతావు. చాలా మంది ఉద్దేశం ఏమిటి అంటే ఏదో కొద్దిసేపుపూజ గదిలో కూర్చొని రావటం సాధన, గుడికి వెళ్ళి అభిషేకం చేస్తే సాధన అనుకొంటారు. అలాగ కాదు. దైనందిన జీవితంలో నీవుచేసేపని నీలోపల ఉన్న చైతన్యాన్ని అందుకొనేటట్లుగా ఉండాలి అది సాధన. ఎదుటివారికి కష్టం వస్తే ఆ కష్టం నీకు వచ్చినప్పుడు ఎంత బాధపడతావో వారిని చూసినప్పుడు అంత బాధ నీవు పడితే నీవు నిజమైన విష్ణు భక్తుడవు అన్నాడు నర్శింహ మెహతా. నిలువు బొట్లు పెట్టు[illegible]ంటే కాదు. గీతలో భక్తుడి లక్షణాలు చెపుతాడు. అది చదువుకొని అవి మనకు ఉన్నాయో లేదో చూసుకోవాలి. లేకపోతే ప్రయత్నం చేసి సంపాదించుకోవాలి. మనం గింజలు వదిలేసి పొల్లును పట్టుకొంటున్నాము. చివరకు గుణాలు వదిలేసిబొట్టు దగ్గరకు దిగాం.

రాముడు అన్నా, కృష్ణుడు అన్నా బ్రహ్మమే. వారిని స్మరించటం వలన వారు బ్రహ్మమే కాబట్టి మనం బ్రహ్మంను పొందుతాము. వారు బ్రహ్మమే. కాని రూపం, నామం కనిపిస్తోంది. సాకారాన్ని అర్థం చేసుకోగలము గాని నిరాకారాన్ని అర్థం చేసుకోలేమని నిరాకారమే మనకు సాకారంగా కనిపిస్తోంది. అది గుర్తించిన వారు ధన్యులు. పనిని విడిచిపెట్టి పారిపోవటం కాదు పనిని సక్రమంగా చేసి దాని వలన వచ్చే ఫలితాన్ని ఈశ్వరార్పితం చేయటం సన్యాసం. హెడ్ మాష్టారు పనిచేసే స్కూలులో ఎక్కువమంది పాసైతే పొంగిపోయి, తక్కువమంది పాసైతే కృంగిపోతున్నారు అనుకోండి అది ఈశ్వరార్పితం కాదు. వాడు చేసే పని శ్రద్ధగా చేస్తూ వచ్చేది వస్తుంది అనుకొని పని చేస్తూ ఉంటే అది ఈశ్వరార్పితం గాని నోటితో ఈశ్వరార్పితం అని చెప్పి ఎక్కువమంది పాసైతే అహంకారాన్ని ఉబ్బించుకొంటే అది ఈశ్వరార్పితం కానే కాదు. *




## పాలకొల్లులో రాఘవేంద్ర స్వామి ఆలయం!!

శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో రాఘవేంద్రస్వామి ఆలయం కూడా వెలసింది. బ్రాడీపేటలో విఘ్నేశ్వర ఆలయం ప్రక్కన అతిసుందరంగా నిర్మించిన ఈ ఆలయం భక్తులను ఎంతగానో ఆకర్షిస్తున్నది. శ్రీదుర్గా లాడ్జి యజమాని బి.యస్. ఆనందరావు వారి కుటుంబసభ్యుల నేతృత్వంలో ఈ ఆలయం నిర్మాణం పూర్తి అయ్యింది. శ్రీ ఆంజనేయ స్వామి సమేత శ్రీ రాఘవేంద్రస్వామి వార్ల ప్రతిష్ఠాపన మహోత్సవాలు మార్చి 21 నుండి 23 వరకు 3 రోజులు అత్యంత భక్తి పర్వకంగా జరిగాయి. ఈ ప్రతిష్ఠాపన ఉత్సవం శ్రీవిద్యాధీశతీర్థ శ్రీ పాదస్వామి దివ్య హస్తాలతో జరిగింది. పుర ప్రజలు భక్తులు రాఘవేంద్రస్వామి కరుణా కటాక్షాలు పొందటానికి వేలాది మంది వేంచేశారు.

# పాలకొల్లులో క్రీడా, సాంస్కృతిక శిక్షణ కేంద్రం

రవణ భాస్కర 29-3-2000 : పాలకొల్లు లజపతిరాయపేటలో కాస్మో కల్చర్ కేంద్రంకు సద్గురు శ్రీ నాన్నగారు మార్చి 25న శంఖుస్థాపన చేశారు. సుమారు 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ భవన సముదాయంలో ఇన్‌డోర్ గేమ్స్, షటిల్ కాక్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, జిమ్, బిలియార్డ్స్ వంటి క్రీడలలో యువకులకు కోచింగ్ యివ్వటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రీడల విభాగాలకు శ్రీ సాగి అచ్యుతరామరాజు (భీమవరం), శ్రీ చెరుకూరి బుద్ధావతారం రాజు భూమి పూజ చేశారు.



భూమి పూజ చేస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు


ఈ శిక్షణ కేంద్రానికి అధ్యక్షులుగా చెరుకూరి బుద్ధావతారం రాజు (బుద్ధరాజు) కార్యదర్శిగా రుద్రరాజు పద్మరాజు, కోశాధికారిగా పెన్మెత్స శ్రీరామరాజు యితర ముఖ్యులతో కమిటీ ఏర్పడింది. క్షత్రియ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న రంగరాజు, కె.వి. రామకృష్ణ రాజు, నర్సాపురం ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షులు యతిరాజులు, పాలకొల్లు టౌన్‌హాల్ అధ్యక్షులు బోనం నరసింహరావు, మార్కెటింగ్ కమిటి అధ్యక్షులు చెరుకూరి రామరాజు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లూరి సీతారామరాజు (విశాఖపట్నం) ప్రధాన దాతగా ముందుకు వచ్చారు.

(26-3-2000 వార్త దినపత్రిక ఆధారంగా)


*With Best Compliments From.....*

**COSMO CULTURAL CENTRE**

Regd. No. 103/2000




Lajapathirai Peta
PALAKOL - 534 260
W.G.Dt., A.P.,

సద్గురు శ్రీ నాన్నగారి చేతుల మీదుగా
శంకుస్థాపన చేయబడినది